క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ



సరస్వతికి పూజలు చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: స్థానిక యూనిక్ పబ్లిక్ పాఠశాలలో గీతా జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సరస్వతీదేవికి పూజలు జరిపారు. పాఠశాల కరస్పాండెంట్ కోనేటి ఆదినారాయణ భగవద్గీత విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



మేళాలో స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ రైతు దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కిసాన్ మేళా ఏర్పాటు చేసి వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించారు. మేళాలో జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ గండినేని శ్రీనివాసులనాయుడు, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన రామకీర్తనలు



పురవీధుల్లో స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

పరవాడ: సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వేకువ జాము నుంచి భక్తులు వాడచీపురుపల్లి దేవాలయానికి చేరుకుని రాముడి కీర్తనలు ఆలపించారు. వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని స్వామిని పల్లకీలో అదిష్టింపజేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం పురవీధుల్లో భగవంతుడిని ఊరేగించారు. పరవాడ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు మాట్లాడుతూ అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముల వారి అక్షింతలను ఈ నెల 24న రామాలయంలో బాలరాముడికి ప్రత్యేక పూజలు జరిపి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మాతృమూర్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ముగిసిన ఆర్య పాలీఫెస్ట్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయుడు తదితరులు

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం గ్రామంలోని ఆర్యభట్టా పాలిటెక్నిక్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆర్య పాలీ ఫెస్ట్–2కె 24 వేడుకలు శనివారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడా పోటీలు, ఎక్స్‌పోల్లో విజయం సాధించిన విజేతలకు శ్రీలక్ష్మీ గణపతి విద్యా సంస్థల చైర్మన్ సీహెచ్ ఎం నాయుడు,డైరెక్టర్ సీహెచ్ సాయిశ్వేత బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ నాగభూషణరావు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కూర్మన్నపాలెం: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 86వ వార్డు పరిధి రాజీవ్‌నగర్ రాసాలమ్మకాలనీకి చెందిన కుచ్చెర్లపాటి సతీష్‌కుమార్(31) భార్య భాగ్యలక్ష్మి పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ప్రైవేట్‌గా ఎలక్ట్రికల్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న సతీష్‌కుమార్ తరచూ బెట్టింగులు ఆడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యేవాడు. భార్య భాగ్యలక్ష్మితో 20 రోజుల కిందటే తాను చచ్చిపోతానని, పిల్లలను బాగా చూసుకోవాలని చెప్పాడు. శనివారం ఉదయం భార్య భాగ్యలక్ష్మిని టిఫిన్ తీసుకు రమ్మని పంపించి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

ఉత్తర ద్వార దర్శనం.. సర్వపాపహరణం



విశేషఅలంకరణలో వెంకన్న



వెంకటాద్రిపై ఉత్తరద్వారంలో పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి



కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శేషతల్పంపై వేంజేసిన వెంకన్న



పెందుర్తిలోని వెంకటాద్రిపై స్వామివారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు

- వైభవంగా ముక్కోటి ఏకాదశి పూజలు
- పోటెత్తిన భక్తజనం

పెందుర్తి: అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి ఉత్తర ద్వార దర్శనంతో భక్తజనం పులకించిపోయింది. గోవింద నామస్మరణ మార్మోగింది. పవిత్ర ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్థానిక వెంకటాద్రిపై శనివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. వేకువజామున వేంకటేశ్వరస్వామికి సుప్రభాత సేవ జరిపి, తిరుప్పావై ప్రవచనాలు వినిపించారు. అనంతరం విశేష అభిషేకాలు చేసి స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉత్తర ద్వారంలో భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహార్షి రామానుజాచార్యులు అర్చనలు జరిపారు. శ్రీవారి సేవకులు ప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం గిరిప్రదక్షిణలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో వెంకటాద్రిపై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. లా అండ్ ఆర్డర్ సీఐ ఎం. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారిని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, దాదాపు 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు.

నమో భగవతే వాసుదేవాయ

సింహాచలం: ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున మూడు గంటలకు స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులు వెంకన్న, శ్రీదేవి,భూదేవిలను విశేషంగా అలంకరించి ఆలయ ఉత్తరద్వారం వద్ద శేషతల్పంపై అదిష్టింపజేశారు. ఉదయం 4.30 నుంచి 11.45 గంటల వరకు భక్తులకు ఉత్తరద్వార దర్శనాలు కల్పించారు. ఆలయ అర్చకులు భార్గవ్, రఘు తదితరులు పూజలు నిర్వహించారు.

- ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలోని రామాలయంలో స్వామివారి ఉత్తరద్వార దర్శనం విశేషంగా జరిగింది. సీతారాముల ఉత్సవమూర్తులనుఆలయ ఉత్తరద్వారం వద్ద అదిష్టంపజేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.
- అడవివరం దరి విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

భక్తుల సేవలో..

సింహాచలం: సింహగిరిపై ఎటు చూసినా భక్తుల కోలాహలం కనిపించింది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్తరద్వార దర్శనానికి తరలి వచ్చిన భక్తులతో సందడిగా మారింది. భక్తులు స్వామిని దర్శించుకుని ఆనంద డోలికల్లో మునిగి తేలారు. ముక్కోటికి వచ్చే భక్తులకు అన్ని శాఖల సమన్వయంతో దేవస్థానం అధికారులు విశేషంగా ఏర్పాట్లు చేశారు.

- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో సింహగిరిపై మూడు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. మూడుషిఫ్టుల్లో 28మంది వైద్యులు, ఆరుగురు స్పెషలిస్టు వైద్యులు, 38 మంది పారా మెడికల్ సిబ్బంది విధులు నిర్వర్తించారు. 42 రకాల మందులు అందించారు. అలాగే 108 అంబులెన్స్, అపోలో ఆస్పత్రి అంబులెన్స్ అందుబాటులో ఉంచారు. డిప్యూటీ సివిల్ సర్జన్‌లు డాక్టర్ రామారెడ్డి, డాక్టర్ ప్రసాద్‌నాయక్‌లు వైద్య శిబిరాలను పర్యవేక్షించారు.
- సింహగిరిపై పాత ఎంక్వైరీ కార్యాలయం వద్ద పోలీస్అవుట్ పోస్టు ఏర్పాటు చేశారు. డీసీపీ ఆనంద్ రెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి ఆధ్వర్యంలో భక్తులకు పలు సూచనలు అందజేశారు.
- సింహగిరిపై ఉన్న అన్నప్రసాద భవనంలో భక్తులకు పొంగలి, పులుసు అన్నప్రసాదంగా అందజేశారు.



సింహగిరిపై మందులు అందిస్తున్న అడవివరం ఆరోగ్య కేంద్రం సిబ్బంది



అవుట్ పోస్టులో భక్తులకు సూచనలిస్తున్న డీసీపీ ఆనంద్‌రెడ్డి, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి



వెంకన్న ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి బారులు తీరి భక్తులు



ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న ఈవో శ్రీనివాసమూర్తి, ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి



ఉత్తర ద్వారంలో అప్పన్నను దర్శించుకుంటున్న అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు



ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



సింహగిరిపై కోలాట ప్రదర్శనలో మహిళలు

సందడిగా క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో రవీంద్రభారతి విద్యార్థులు, పాఠశాల ప్రతినిధులు

పెందుర్తి: పలు విద్యాసంస్థల్లో శనివారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులు శాంతాక్లాజ్, క్రిస్మస్‌తాత వేషధారణల్లో సందడి చేశారు. నృత్యాలతో ఆకట్టుకున్నారు. డీజీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప పాల్గొన్నారు.

- స్థానిక భాష్యం పాఠశాలలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు నృత్యాలతో సందడి చేశారు. క్రీస్తు జన్మించిన బెత్లెహెం గ్రామ సెట్ ఆకట్టుకుంది. సి.ఈ.ఓ సత్యం, జెడ్‌ఈవో వెంకట్, ప్రిన్సిపాల్ దీపిక, పాల్గొన్నారు.
- సుజాతనగర్‌లోని ఇండియన్ స్ప్రింగ్స్ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో కీస్తు జననం నాటిక వేసి విద్యార్థులు అలరించారు. హెచ్‌ఎం ఎస్.రమాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విభిన్న వేషధారణల్లో భాష్యం విద్యార్థులు

పరవాడ: మండలంలో పి.బోనంగి సంస్కృతిగ్లోబల్ స్కూల్ యాజమాన్యం క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించింది. వేడుకల్లో భాగంగా చిన్నారులు క్రిస్మస్ తాత, దేవదూతల వస్త్రధారణ ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి , పాఠశాల సీఈవో నిశాంత్, కోఆర్డినేటర్ రామలక్ష్మి చిన్నారులతో పాటు వేడుకలు నిర్వహించిన ఉపాధ్యాయులను అభినందించారు.



క్రిస్మస్ వేడుకల్లో సంస్కృతి గ్లోబల్‌చిన్నారులు

26 నుంచి ఏవీఎన్‌లో 'ఆహ్వాన్–2కే23'



ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న అదీప్ భానోజీరావు తదితరులు



లఘు నాటిక ప్రదర్శిస్తున్న విద్యార్థులు

డాబాగార్డెన్స్ : నగరంలోని ప్రముఖ విద్యా సంస్థ ఏవీఎన్ కళాశాలలో ఈ నెల 26 నుంచి రెండ్రోజుల పాటు 'ఆహ్వాన్–2కే23'పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. తొలిరోజు కార్యక్రమంలో ప్రముఖ సినీ తార అవికాగోర్, జబర్దస్త్ ఫేం బుల్లెట్ భాస్కర్, ఐనవోలు ప్రసన్నకుమార్, రెండో రోజు కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ మెజీషియన్ బీఎస్ రెడ్డి హాజరు కానున్నారు. ఈ మేరకు కళాశాల కరస్పాండెంట్ అదీప్ భానోజీరావు, ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు శనివారం కళాశాల ప్రాంగణంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను ప్రముఖులు సందర్శించి విద్యార్థులను అభినందించారు. కిసాన్ దివస్‌ను పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు(విద్యార్థులు) రైతులు పడే కష్టాల్ని వివరిస్తూ ప్రదర్శించిన లఘు నాటిక ఆకట్టుకుంది. పలువురు విద్యార్థులు రైతుల వేషధారణతో కూరగాయలు విక్రయించే స్కిట్ ప్రదర్శించారు. 26 నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఫెస్ట్‌కు సంబంధించిన వివరాల్ని నిర్వాహకులు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, స్వరాజ్యలక్ష్మి, మీడియా కో ఆర్డినేటర్ పైడి రజని, గాంధీ, అర్చన, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతాం'

కూర్మన్నపాలెం: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు ధారపోస్తున్న బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు పేర్కొన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం 1045వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ప్రజల సొమ్ముతో ప్రభుత్వ రంగ సంస్థలను అభివృద్ధి చేసి ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే వారు లాభాలు దండుకుని ప్రజలను అణచివేస్తారని విమర్శించారు. అందుకే విశాఖ ఉక్కుతో సహా అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిందాల్‌తో జరిగిన ఎంవోయూ రద్దు చేయాలి



స్టీల్‌ప్లాంట్ సీజీఎం సోబ్తీకి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

ఉక్కునగరం: జిందాల్‌తో జరిగిన ఎంవోయూను రద్దు చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏఐయూసీ, ఐఎన్‌టీయూసీ, సిటు ఆధ్వర్యంలో ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద ధర్నా చేశారు. ఎంవోయూను రద్దు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నూరు శాతం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికవర్గం గత 1050 రోజుల నుంచి దీక్షలు చేస్తుందన్నారు. కాని ఉక్కు యాజమాన్యం ఈవోఐ పేరిట జిందాల్‌లో రూ. 500 కోట్లకు రెండేళ్ల ఒప్పందం చేసుకోవడం దుర్మార్గమన్నారు. వెంటనే ఆ ఒప్పందాన్ని రద్దు చేసి సెయిల్‌తో ఎంవోయూ చేసుకోవాలని లేదా సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం స్టీల్ ప్లాంట్ సీజీఎం సోబ్తీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్. రావు, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, జె. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లకు ఐదు రోజుల జైలుశిక్ష

పద్మనాభం: మండలంలోని మద్దిలో చెరకు కాటా సమీపంలో జులై నెలలో పేకాట ఆడుతున్న నలుగురిపై నమోదు చేసిన కేసులో శనివారం భీమునిపట్నం 14వ మెట్రోపాలిటన్ కోర్టు ఐదు నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్టు సీఐ ఎస్.సన్యాసి నాయుడు తెలిపారు. మద్ది గ్రామానికి చెందిన మద్ది సురేష్, జొన్నాడ రాంబాబు, బాడితమాను సాయి, తదితరులకు జైలుశిక్ష విధించారన్నారు.

జాతీయ నృత్య పోటీలకు నడుపూరు విద్యార్థులు



నృత్య పోటీల్లో విద్యార్థినుల బృందం

పెదగంట్యాడ: జాతీయ స్థాయి జానపద నృత్య పోటీలకు నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. విజయవాడ దగ్గర హిల్స్ పారడైజ్‌లో విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రథమ స్థానంలో నిలిచారు. టి.నవ్యశ్రీ, టి.తేజస్వీ, ప్రణీత, దాని శ్రీవల్లి, ఎ.తేజశ్రీ, ప్రియాంక సామల్ బృందం ఈ పోటీల్లో సత్తా చాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్టు ప్రాధాన్యం–చెట్టుతో మనిషికి ఉన్న అనుబంధాన్ని వివరించేలా నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. వచ్చే నెల 3 నుంచి 6 వరకూ ఒడిశాలోని భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీలకు వీరు హాజరు కానున్నారు. సత్తా చాటి వచ్చిన విద్యార్థులను శనివారం జరిగిన అభినందన సభలో డీఈవో చంద్రకళ, ఉప విద్యాశాఖాధికారి గౌరీశంకర్, పాఠశాల హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్, వీరికి శిక్షణ ఇచ్చిన రాంబాబు, సుగుణ, శోభారాణి, టీవీ లక్ష్మిలను అభినందించారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుల నియామకం



మట్టా ప్రసాద్



యడ్ల నాయుడు



భాస్కరరావు



కార్తీక్ సంపత్ వర్మ



షణ్ముక్ శివకుమార్

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని మండలాలు , క్లస్టర్లకు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షులను నియమిస్తూ శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

- పెందుర్తి రూరల్ మండల యువజన విభాగం అధ్యక్షుడిగా గొరపల్లికి చెందిన మట్టా ప్రసాద్ నియమితులయ్యారు.
- సబ్బవరం మండల యువజన విభాగం అధ్యక్షుడిగా మొగలిపురానికి చెందిన యడ్ల నాయుడు, పరవాడ మండల యుజవన విభాగం అధ్యక్షుడిగా ఈ.బోనంగికి చెందిన కంచిపాటి భాస్కరరావును నియమించారు.
- పెందుర్తి జీవీఎంసీ క్లస్టర్–1 యువజన విభాగం అధ్యక్షుడిగా నాయుడుతోటకు చెందిన ఎం.కార్తీక్ సంపత్ వర్మ, పెందుర్తి క్లస్టర్–2 యువజన విభాగం అధ్యక్షుడిగా లంకెలపాలెనికి చెందిన కొవ్వురి షణ్ముక శివకుమార్ నియమితులయ్యారు.

28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ విభాగంలో ఈ నెల 28, 29 తేదీల్లో బయోమిచికా 2కే23 జాతీయ వర్క్‌షాప్ జరగనుంది. ఈ మేరకు సదస్సు పోస్టర్‌ని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బయోకెమిస్ట్రీ విభాగాధిపతి ఆచార్య పి.సుభాషిణి దేవి మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్‌లో ఇమ్యునాలజీ, జెనిటిక్ ఇంజినీరింగ్, బయోకెమికల్ టెక్నికల్‌లతో శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో విభాగ పరిశోధకులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కేంద్రం డైరెక్టర్‌గా ఆచార్య పల్లవి



వీసీ కె.సమత నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఆచార్య కె.సమత

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం దుర్గాబాయి దేశముఖ్ మహిళా అధ్యయన కేంద్రం సంచాలకురాలిగా ఏయూ క్రీడా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్‌ల నుంచి ఆమె శనివారం నియామక ఉత్తర్వులు అందుకున్నారు. అనంతరం డాక్టర్ పి.ఉష నుంచి ఆచార్య పల్లవి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య పల్లవిని ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, పలువురు ఆచార్యులు, తదిరతులు అభినందించారు.